మనకు లభించే చిన్న
అవకాశాలే భవిష్యత్తులో
ఉన్నత శిఖరాల్ని
చేరుస్తాయి
– బెంజమిన్ ఫ్రాంక్లిన్

Truth of News
PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 21 | ఆదివారం 30 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## ఉజ్బెకిస్థాన్ చేరుకున్న పీఎం మోడీ



### తాష్కెంట్‌లో మోదీకి ఘన స్వాగతం

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :

విదేశీ పర్యటన నేపథ్యంలో ప్రధాని మోడీ ఉజ్బెకిస్థాన్ వెళ్లారు. శనివారం ఆ దేశ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్న ప్రధాన మంత్రికి ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో, రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాన మంత్రి, అధ్యక్షుడు మిర్జియోయేవ్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరుపుతారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానత, ఇంధనం, విద్య మరియు ప్రజల మధ్య సంబంధాల వంటి రంగాలలో సహకారాన్ని ఈ ఇద్దరు నాయకులు సమీక్షించడంతో పాటు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన అజెండాను

- మిగతా 2లో..

## 'శుద్ధి'పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి



- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి
- ఖర్గేకు న్యాయం జరిగేంత వరకు పోరాడతాం
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం అంటరానితనం అమలు
- మీడియా సమావేశంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్

డెహ్రాడూన్– సూర్య వాస్తవం :

'ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నెల 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో పర్యటించారు. అక్కడి రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఓ బహిరంగ సభకు హాజరయ్యారు. ఆయన పర్యటన తర్వాత కొందరు స్థానికులు మైదానం సమీపంలోని రామాలయాన్ని శుద్ధి చేశారు. ఖర్గే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారని తెలిసే ఈ శుద్ధీకరణ జరిగింది.అంటరానితనం అమలులో భాగంగానే కులోన్మాదులు శుద్ధీకరణకు పూనుకున్నారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి' అని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో శనివారం

- మిగతా 2లో..

## టీఎంసీ అధినేత్రి, మమత బెనర్జీపై కేసు

- హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై ఎఫ్ఐఆర్
- మరికొందరు పార్టీ విద్యార్థి నేతలపై కూడా



కోల్‌కతా– సూర్య వాస్తవం :

పశ్చిమ బంగాల్ హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి నందుకు టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బెనర్జీతో పాటు టీఎంసీపీ (తృణమూల్ ఛాత్ర పరిషత్) సమావేశ నిర్వాహకులపై కూడా కోల్‌కతాలోని హేస్టింగ్స్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉల్లంఘనల్లో ప్రమేయమున్న వారందరి పాత్ర దర్యాప్తు క్రమంలో పరిశీలిస్తామన్నారు. ఆగస్ట్ 28న టీఎంసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మమతా బెనర్జీకి సంబంధించిన

- మిగతా 2లో..

# కడసారి వీడ్కోలుకూ నోచుకోలేదు!

- నేపాల్‌లో ఒకేరోజు 233 మృతదేహాల వెలికితీత
- నలుగురి వివరాలు మాత్రమే గుర్తింపు
- మిగిలిన 229 మృతదేహాలకు సామూహిక అంత్యక్రియలు
- మొత్తంగా 675కి చేరిన మృతుల సంఖ్య
- మరో 2,400 మంది ఆచూకీ కోసం కొనసాగుతున్న రెస్క్యూ



ఖాఠ్మాండు – సూర్య వాస్తవం

నేపాల్‌లో మరణ మృదంగం మోగుతూనే ఉన్నది. వరద బీభత్సం తాలూకు విషాదఛాయలు నదీ పరీవాహక ప్రాంతాలను అలముకూనే ఉన్నాయి. ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది ఆపరేషన్‌లో వందలాది మృతదేహాలు బయటపడుతున్నాయి. చిత్వాన్ జిల్లాలో రెస్క్యూ సిబ్బంది వెలికితీసిన 233 మృతదేహాల్లో కేవలం నాలుగింటిని మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించగలిగారు.

మిగిలిన 229 మృతదేహాలకు శనివారం స్థానిక యంత్రాంగం దేవఘాట్‌లో సామూహిక అంత్యక్రియలు నిర్వహించారు. భవిష్యత్తులో మృతదేహాల గుర్తింపు కోసం ప్రతి మతదేహం నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించారు. వాటికి ప్రత్యేక కోడ్ ఇచ్చి రికార్డులను భద్రపరుస్తున్నారు. తాజా అధికారిక గణాంకాల ప్రకారం వరదల్లో గల్లంతై మృతిచెందిన వారి సంఖ్య 675కి చేరుకుంది.

మరో 2,400 మంది ఆచూకీ కోసం రెస్క్యూ కొనసాగుతూనే ఉంది. గల్లంతైన వారిలో నేపాలీలతో పాటు విదేశీ పర్యటకులూ ఉన్నారు. నేపాల్‌తో పాటు టిబెట్ ప్రాంతంలో కూడా భారీగా ప్రాణనష్టం సంభవించింది. వేలాది నివాస గృహాలు నేలమట్టమయ్యాయి. మరికొన్ని వరదల్లో కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించింది.

**మళ్లీ భయం.. భయం**

భోటేక్యోషి, త్రిశూలి నదుల్లో నీటిమట్టం మళ్లీ పెరుగుతున్నది. దీంతో సరస్సుల ఆనకట్టలు తెగిపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారులు స్థానికులను అప్రమత్తం చేశారు. స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సహాయక చర్యల కోసం నేపాల్ ప్రభుత్వం తొలుత విదేశీ సహాయాన్ని తిరస్కరించింది. కానీ, పరిస్థితులు చేయి దాటిపోతుండటంతో

- మిగతా 2లో..



## దద్దరిల్లిన కీవ్

- ఉక్రెయిన్ రాజధానిపై రష్యా డ్రోన్ దాడులు
- 37 మంది మృతి.. 42 మంది క్షతగాత్రులు

కీవ్ – సూర్య వాస్తవం

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై శుక్రవారం అర్ధరాత్రి రష్యా విరుచుకుపడింది. ఏకధాటిగా జరిపిన డ్రోన్ దాడుల్లో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 42 మంది క్షతగాత్రులయ్యారు. దాడుల్లో 50కి పైగా నివాసాలు దెబ్బతిన్నాయి. అప్రమత్తమైన స్థానిక యంత్రాంగం 380 మందికి పైగా పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించగలిగారు. మౌలిక సదుపాయాలు, చమురు నిల్వ సంస్థలు, నౌకాశ్రయాలు, లాజిస్టిక్స్ గోదాములను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేస్తున్న నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరింపజేశారు. మరోవైపు, కీవ్ సమీపంలోని మైలా గ్రామంలో ఉన్న ప్రైవేటు సంస్థ పేలుడు పదార్థాల గోదామును రష్యా టార్గెట్ చేసి డ్రోన్లు ప్రయోగించిందని, అందుకే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని యంత్రాంగం గుర్తించింది. నివాస ప్రాంతాల మధ్య మందుగుండు సామగ్రి నిల్వ చేయడంపై దర్యాప్తు చేస్తున్నది.



## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

- మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం
- పీహెచ్‌సీలను జిల్లా ఆసుపత్రులతో అనుసంధానించేలా ప్రణాళిక
- టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- మారుమూల ప్రాంతాల్లోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ

## ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...ఇప్పుడొక మాట

- ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ
- గిరిజన ప్రాంతాల్లో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం
- రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ
- సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల

అమరావతి– సూర్య వాస్తవం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజక వర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి

- మిగతా 2లో..



## గడువు పెంచండి

- 'సర్' ప్రక్రియలో విధానపరమైన లోపాలు
- రాష్ట్రంలో మూడో వంతు ఓటర్లపై ప్రభావం
- అర్హులైన ఏ ఒక్కరి ఓటూ పోవద్దు
సవరణకు తగినంత సమయం ఉంది
- లోపాలను సరిదిద్దాలి - ఈసీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

హైదరాబాద్ – సూర్య వాస్తవం

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. రాష్ట్రంలో దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే ఈ ప్రక్రియలో విధానపరమైన లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని పేర్కొన్నారు. అందుకు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన

- మిగతా 2లో..



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఉజ్బెకిస్థాన్ చేరుకున్న పీఎం మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఖరారు చేస్తారు. ఆ తర్వాత కిర్గిస్థాన్‌లో జరిగే ఎస్‌సీవో 2026 సదస్సుకు హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ అవుతారని భారత విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## 'శుద్ధి'పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది రాజ్యాంగ పరిరక్షణకు, ఆర్ఎస్ఎస్- బీజేపీ భావజాలానికి మధ్య జరుగుతున్న పోరాటమని అభివర్ణించారు.

ప్రధాని మోదీ సబ్బండ కులాలు సమానమని ప్రచారం చేస్తుంటే, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ మాత్రం శుద్ధీకరణను సమర్థించడం శోచనీయమన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మానసిక స్థితికి శుద్ధీకరణ చర్య ప్రతిబింబమంటూ మండిపడ్డారు. ఎస్సీలు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు ఇష్టం లేదని అభిప్రాయపడ్డారు. శుద్ధీకరణ జరిగి 20 రోజులు గడిచినా, హల్ద్వానీ పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం విస్మయం వ్యక్తం చేశారు.

**మల్లికార్జున ఖర్గేకు న్యాయం జరిగే వరకు పోరాటం**

హల్ద్వానీలో శుద్ధీకరణ చర్య ఒక్క ఖర్గేకే పరిమితం కాలేదని, కేంద్ర మంత్రి జితిన్‌రాం మాంఝీ అదే ఆలయాన్ని సందర్శించిన తర్వాతా శుద్ధీకరణ జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికైనీ కేంద్రంతో పాటు ఉత్తరాఖండ్ ప్రభుత్వం స్పందించి ఖర్గేకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఖర్గేకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

ఆర్ఎస్ఎస్ భావజాలం కారణంగా దేశంలో అంటరానితనం పెచ్చరిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఇప్పటికీ ఎస్సీ వర్గాలకు చెందిన పిల్లలతో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం వంటి అమానుషాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లోనైతే కనీసం ఆ సామాజికవర్గాలకు చెందిన వారికి తాగునీరు కూడా దొరకని పరిస్థితి దాపురించిందని విస్మయం వ్యక్తం చేశారు.

## టీఎంసీ అధినేత్రి, మమత బెనర్జీపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సభకు పోలీసులు అనుమతించలేదు. దీంతో టీఎంసీ హైకోర్టును ఆశ్రయించడంతో పలు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా భారీ కటౌట్‌లు, హోర్డింగ్‌లు పెట్టారు. ఇది గుర్తించిన కేఎంసీ (కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్) కామాక్ స్ట్రీట్‌లో టీఎంసీ గుర్తులతో ఉన్న అనధికారిక హోర్డింగ్‌ను తీసివేసేందుకు ప్రయత్నించింది.దీంతో టీఎంసీ నాయకులు, కార్యకర్తలు వారితో ఘర్షణకు దిగారు. అధికారులు పోలీసుల సహాయంతో వాటిని తొలగించేందుకు ప్రయత్నించగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ చర్యను నిరసిస్తూ కేఎంసీ, హేస్టింగ్స్ పోలీసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని పలు కారణాలు చూపారు. విచారణ సందర్భంగా హైకోర్టు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టాలని ఉత్తర్వులిచ్చింది. కాగా ఈ చర్యను టీఎంసీ ఖండించింది. బీజేపీ ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించింది.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

**అమరావతి- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే బృహత్తర ప్రాజెక్టును త్వరలో విస్తృతం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సాంకేతికత ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చినప్పుడే దానికి నిజమైన సార్ధకత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తలపెట్టిన డ్రోన్ ప్రాజెక్టును సమీక్షించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ, రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉండే గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అన్నారు. డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర ఔషధాలను వేగంగా చేరవేయడం వంటివి ఈ ప్రాజెక్టులో కీలకమని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) జిల్లా ఆసుపత్రులతో, ఇతర వైద్య విభాగాలతో అనుసంధానించడం సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఉన్న ఈ విధానాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్నాలజీ సహాయంతో ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.

## కడసారి వీడ్కోలుకూ
# నోచుకోలేదు!

(మొదటి పేజీ తరువాయి)

భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా దేశాల సాయం కోరింది. ఆయా దేశాల నుంచి ఇప్పటికే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రవాణా సౌకర్యం లేని ప్రదేశాల్లోనూ సైనిక బలగాలు ప్రాణాలను పణంగా పెట్టి సహాయక చర్యలను ముమ్మరం చేస్తున్నాయి.

**'ఇన్ఫోసిస్' లక్ష్మీనాథ్ మిస్సింగ్**

నేపాల్ వరదల్లో ప్రముఖ టెక్ సంస్థ ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈవో లక్ష్మీనాథ్ గోపిశెట్టి గల్లంతయ్యారు. వ్యక్తిగత పనిమీద నేపాల్ వెళ్లిన ఆయన వరదల అనంతరం అందుబాటులోకి రాలేదు. ఫోన్ కూడా అవుట్ ఆఫ్ సర్వీస్‌గా వస్తున్నట్లు సంస్థ అధికారులు శనివారం ప్రకటించారు. ఆయన క్షేమంగా ఉన్నారో లేదో నిర్ధారించుకోవడమే తమ తక్షణ ప్రాధాన్యత అని ఆ సంస్థ వెల్లడించింది.

**88 మంది భారతీయులు సురక్షితం**

నేపాల్ వరదలపై శనివారం రాత్రి భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. వరదల్లో మొత్తంగా 287 మంది భారతీయులు గల్లంతు కాగా, వారిలో 88 మంది సురక్షితంగా వరద ముప్పు నుంచి బయటపడినట్టు స్పష్టం చేసింది. గల్లంతైన వారిలో 128 మంది ఎన్ఆర్ఐలు ఉన్నట్లు పేర్కొంది. గల్లంతైన వారి ఆచూకీ కోసం భారత్ నుంచి ప్రత్యేక సహాయక బృందాలు నేపాల్‌కు చేరుకున్నాయని, ఆయా బృందాలు ముమ్మరంగా గాలింపులు చేపడుతున్నట్లు తెలిపింది.

# గడువు పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

సహాయం అందించాలని విజ్ఞ ప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌కు శనివారం లేఖ రాశారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకుండా, అలాగే అనర్హులు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారి న, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించారని పేర్కొన్నారు. వీరిలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారినట్టుగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చే యాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని.. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు.

నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం- ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్ల ను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్, మే డ్చల్-రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీ సుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయ ని తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తా త్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవ రణ ప్రక్రియను మరింత సులభతరం చే యాల్సిన అవసరం ఉందన్నారు.

**ఇప్పట్లో ఎన్నికల్లేవు.. జాబితా సవరించాలి**

సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు సెప్టెంబర్ 16 వరకు మాత్రమే ఉందని, కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు సమయం సరిపోదని లేఖలో పేర్కొన్నారు. కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. అవసరమైతే సహాయ కేంద్రా లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 172 ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబి తాను సవరించి విస్తరించాలని సూచించారు.అలాగే తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ఏకగ్రీవాలపై అధికారంలో
# ఒక మాట...ఇప్పుడొక మాట

(మొదటి పేజీ తరువాయి)

నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు.

ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు.

గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు.

ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పీఏబీఆర్-పాపంపేట తాగునీటి పథకం ఏమైంది .?

- నీటి విషయంలో 'అనంత'కు తీరని అన్యాయం..!
- చంద్రబాబు సర్కారు విధానాలతో జిల్లా ఎడారిగా మారే ప్రమాదం
- గతేడాది 52 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు
- పేరూరు డ్యాంకు రెండేళ్లుగా చుక్క నీరెందుకు ఇవ్వలేదు..?
- జీడిపల్లి--అప్పర్ పెన్నార్ భూసేకరణ బకాయిలు వెంటనే చెల్లించాలి
- స్పందించకపోతే ఎమ్మెల్యే ఇళ్ల ముందు ధర్నా చేస్తాం: తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**అనంతపురం - సూర్య వాస్తవం :** సాగు, తాగునీటి విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రానున్న రోజుల్లో అనంతపురం జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం చేపట్టిన సాగు, తాగునీటి పథకాలను నిర్లక్ష్యం చేస్తూ ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి విధానాల్లో మార్పు తీసుకురావాలని సూచించారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**52 టీఎంసీల నీటిని ఏం చేశారు?**

గత ఏడాది 52 టీఎంసీల నీటిని జిల్లాకు అందించామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఈ ఏడాది పరిస్థితులను ఎందుకు ముందుగా అంచనా వేయలేకపోయారని ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిసినప్పటికీ గతేడాది లభించిన నీటిని సద్వినియోగం చేసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాలువల వద్ద పోలీసు బందోబస్తు, రైతుల మోటార్లు, పైపులైన్ల తొలగింపు వంటి పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

**లైనింగ్ పేరుతో రూ.4 వేల కోట్ల దోపిడీ**

హంద్రీ--నీవా కాలువ లైనింగ్ పేరుతో సుమారు రూ.4 వేల కోట్ల ప్రజాధనం వృథా చేశారని ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. కాంక్రీట్ లైనింగ్ కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయని అన్నారు. గండికోట నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని తరలించి చెరువులు నింపే విధానాన్ని గత ప్రభుత్వం ప్రతిపాదించిందని, దానిని ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు.

**ఆర్నెళ్లలో 50 శాతం మంది వలసలు**

ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే రానున్న ఆర్నెళ్లలో జిల్లాలోని 50 శాతం మంది ప్రజలు ఉపాధి కోసం వలస వెళ్లే పరిస్థితి వస్తుందని ప్రకాష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు, ఉరవకొండ 36వ ప్యాకేజీ పనులపై కూడా ఆయన పలు ఆరోపణలు చేశారు. పెండింగ్ పనులకు భారీగా అంచనాలు పెంచుతున్నారని విమర్శించారు.

**పేరూరు డ్యాంకు నీళ్లపై ప్రశ్నలు**

పేరూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరు అందించేందుకు 2020లో జీఓ జారీ చేశారని ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రాప్తాడు, పెనుకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని ఆరు మండలాలకు తాగునీటి అవసరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. గతంలో పేరూరు డ్యాంకు నీటిని అందించామని, ప్రస్తుతం నీరు లేక బోర్లు ఎండిపోతున్నాయని ఆరోపించారు. నీటి విడుదలపై ఎమ్మెల్యే పరిటాల సునీతను ప్రశ్నించారు.



**జీడిపల్లి--అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుపై నిలదీత**

జీడిపల్లి--అప్పర్ పెన్నార్ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, అప్పటి వరకు ప్రజలకు తాగునీటి పరిస్థితి ఏమిటని ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటివరకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పనులు ఆశించిన స్థాయిలో పూర్తికాలేదని ఆరోపించారు. భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**6,300 క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ--నీవా**

హంద్రీ--నీవా కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచి, వరద సీజన్‌లో రిజర్వాయర్లు, చెరువులను నింపేలా గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ల నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చేపట్టామని చెప్పారు. ఆ కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు.

**పీఏబీఆర్--పాపంపేట తాగునీటి పథకం ఏమైంది?**

పీఏబీఆర్ నుంచి పాపంపేట వరకు తాగునీరు అందించేందుకు రూ.90 కోట్లతో చేపట్టిన పథకంలో 70 శాతం పనులు పూర్తయ్యాయని ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రెండేళ్లుగా మిగిలిన పనులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈ పథకం ద్వారా ఆత్మకూరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు కూడా తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు.

**ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తా**

జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తానని ప్రకాష్‌రెడ్డి అన్నారు.

ప్రాజెక్టుల పేరుతో జరుగుతున్న అవకతవకలు, రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

**ధర్నాలకు పిలుపు**

పేరూరు డ్యాంకు నీటిని విడుదల చేయకపోతే ఆరు మండలాల ప్రజలతో కలిసి ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంటి ముందు ధర్నా చేపడతామని ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. పీఏబీఆర్--పాపంపేట తాగునీటి పనులు పూర్తి చేయకపోతే సంబంధిత మండలాల ప్రజలు ఆందోళనకు దిగుతారని అన్నారు. జీడిపల్లి--అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ బకాయిలు చెల్లించకపోతే బాధిత రైతులతో కలిసి నిరసనలు చేపడతామని తెలిపారు. మొదట సంబంధిత ఎస్ఈ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, స్పందన లేకుంటే ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# సంపాదకీయం

## 8 రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు

హిమాలయాలు అంటే మంచు కొండలు. గ్లేషియర్లు. ప్రపంచంలోని కోట్లాది మందికి జీవనాధారం అందించే నదుల పుట్టినిల్లు. కానీ ఇప్పుడు ఇదే హిమాలయ ప్రాంతం వాతావరణ మార్పులతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. మంచు వేగంగా కరుగుతోంది. గ్లేషియర్లు వెనక్కి తగ్గుతున్నాయి. కొత్తగా ఏర్పడుతున్న హిమ సరస్సులు ఉబ్బిపోతున్నాయి. కొండచరియలు, మంచు చరియలు విరిగిపడి..ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన ఘోర వరదలు ఈ ప్రమాద తీవ్రతను మరోసారి ప్రపంచం ముందు ఉంచాయి.హిమాలయాల్లో మంచు కరుగుతోంది. కొండలు అస్థిరమవుతున్నాయి. హిమ సరస్సులు పెరుగుతున్నాయి. ఆకస్మిక వరదల ముప్పు విస్తరిస్తోంది. నేపాల్-టిబెట్ సరిహద్దులో తాజా విషాదం ఒక ప్రాంతానికి మాత్రమే సంబంధించిన ఘటన కాదు. హిమాలయాలు వేడెక్కితే.. ఆ ప్రభావం పర్వతాల నుంచి మైదానాల వరకు.. నదుల నుంచి కోట్లాది ప్రజల జీవనంపై పడే అవకాశం ఉంది. హిమాలయాల్లో వరద పుట్టేది ఎత్తైన పర్వత ప్రాంతాల్లో.. మొదటి దెబ్బ తగిలేది గ్లేషియర్ దిగువన ఉన్న నదీ లోయలకు.. ఆ తర్వాత నదీ తీర గ్రామాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితమవుతాయి.. చివరికి నది ప్రవాహం దిగువ మైదాన ప్రాంతాలకు చేరుతుంది.అందుకే వరద పుట్టేది పర్వతాలపై.. మొదటి దెబ్బ నదీ లోయలకు.. తర్వాత నదీ తీర గ్రామాలకు.. చివరికి దిగువ మైదాన ప్రాంతాలకు అనే ప్రమాద గొలుసును ముందుగానే అర్థం చేసుకోవాలి.హిమాలయాల్లో వచ్చే వరదలకు భారతదేశంలో ప్రధానంగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు నేరుగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే వరద నీరు నదుల వెంట దిగువకు ప్రవహించడంతో పశ్చిమ బెంగాల్, అసోం వంటి మైదాన రాష్ట్రాలపైనా ప్రభావం పడొచ్చు.టిబెట్‌లో పుట్టే అనేక నదులు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి వచ్చిన తర్వాత సియాంగ్‌గా.. ఆపై అసోంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. మరోవైపు తీస్తా వంటి నదులు సిక్కిం, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల హిమాలయాల్లో వరద అంటే పర్వత ప్రాంతానికే పరిమితమైన సమస్య కాదు.. నదీ ప్రవాహం ఎక్కడివరకు వెళ్తుందో అక్కడివరకు ముప్పు విస్తరించే అవకాశం ఉంటుంది.నష్టం ఎంత ఉంటుందనేది వరద పరిమాణం, నది వెడల్పు, లోయ ఆకారం, దిగువన ఉన్న జనాభా, వంతెనలు, డ్యామ్‌లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగడంతో తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా భారీగా పెరిగింది. ఈ విపత్తులో ప్రాణ నష్టం సంభవించడంతో పాటు వంతెనలు, రహదారులు, భవనాలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1,200 మెగావాట్ల తీస్తా-ఎఎఎ జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు.చమోలీలో సంభవించిన ఆకస్మిక వరదలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు లేదా గల్లంతయ్యారు. జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు, నదీ లోయల్లోని మౌలిక సదుపాయాలు భారీగా దెబ్బతిన్నాయి. ఈ రెండు ఘటనలు చెబుతున్న సందేశం ఒక్కటే?ప్రాణ నష్టంతో పాటు విద్యుత్, రవాణా, వ్యవసాయం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థలపైనా భారీ ప్రభావం పడుతుంది.నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు, మట్టి ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. గ్లేషియర్‌లోని మంచు, రాళ్లు ఒక్కసారిగా కూలిపోయి భారీ నీటి ప్రవాహం ఏర్పడిందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. భోటే కోసి నది లోయలోకి దూసుకొచ్చిన వరదలు గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు.

గల్లంతైన వారిలో విదేశీయులు, పర్యాటకులు, యాత్రికులు కూడా ఉన్నారు.ఈ ఘటనకు భూకంపమే కారణమన్న తొలినాటి అనుమానాలను తర్వాతి పరిశీలనలు బలపరచలేదు. గ్లేషియర్ కూలిపోవడం, మంచు-రాళ్ల ప్రవాహం, నదిలో ఒక్కసారిగా భారీ నీటి ఉద్ధృతి కలిసి ఈ విపత్తుకు కారణమైందని నిపుణుల అంచనాలు సూచిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు సహాయక చర్యలకు కూడా పెద్ద అవరోధంగా మారాయి.హిమాలయాల్లో ఇటువంటి విపత్తులు గతంలోనూ వచ్చాయి. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ ప్రాంతంలో మంచు-రాళ్ల ప్రవాహం, వరదలతో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగి గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 2024లో నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలతో వందల మంది మరణించారు. అదే ఏడాది నేపాల్‌లోని థామే ప్రాంతంలో గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ వచ్చి ఇళ్లు, హోటళ్లు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సహా అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. 2025లోనూ నేపాల్-టిబెట్ సరిహద్దులో భారీ వరదలు ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయి.హిమాలయాల ఎత్తు ప్రాంతాన్ని బట్టి భారీగా మారుతుంది. పర్వత పాద ప్రాంతాలు కొన్ని వందల మీటర్ల ఎత్తులో ఉండగా.. ఎత్తైన హిమాలయ ప్రాంతాల్లో 5,000 నుంచి 6,000 మీటర్లకు పైగా ఎత్తులు సాధారణం. ఎవరెస్ట్ వంటి శిఖరాలు 8,000 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.భారత్‌లోని హిమాలయ రాష్ట్రాల్లో అనేక పట్టణాలు, గ్రామాలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు నదీ లోయలకు సమీపంలోనే ఉన్నాయి. పర్యాటకం పెరగడం, రహదారులు విస్తరించడం, కొండ ప్రాంతాల్లో నిర్మాణాలు పెరగడం వల్ల ప్రమాద సమయంలో ప్రభావితమయ్యే ఆస్తుల విలువ కూడా పెరుగుతోంది. ఒక గ్లేషియర్ లేదా హిమ సరస్సు నుంచి అకస్మాత్తుగా నీరు విడుదలైతే.. అది కేవలం నీరు కాదు. నీటితో పాటు రాళ్లు, మట్టి, మంచు, చెట్లు, నిర్మాణాల అవశేషాలు కూడా దిగువకు కొట్టుకొచ్చే అవకాశం ఉంది. దీంతో సాధారణ వరద కంటే విధ్వంసకరంగా మారుతుంది.ఇలాంటి విపత్తులను పూర్తిగా ఆపడం సాధ్యం కాకపోయినా.. నష్టాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం సాధ్యమే.

ప్రమాదకర హిమ సరస్సులను ఉపగ్రహాలు, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి. సరస్సుల్లో నీటి మట్టం, మంచు గోడల స్థిరత్వాన్ని కొలిచే సెన్సర్లను ఏర్పాటు చేయాలి. అత్యంత ప్రమాదకర సరస్సుల్లో అవసరమైన చోట నియంత్రితంగా నీటిని తగ్గించే చర్యలు చేపట్టాలి. అంతకంటే ముఖ్యంగా ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌లను బలోపేతం చేయాలి. ఎగువ ప్రాంతాల్లో ప్రమాద సంకేతాలు గుర్తించిన వెంటనే దిగువ గ్రామాలకు సైరన్లు, మొబైల్ అలర్టులు, రేడియో, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా సమాచారం చేరాలి.హిమాలయాలు భారత్, నేపాల్, భూటాన్, చైనా వంటి అనేక దేశాలకు సాధారణ సహజ వ్యవస్థ. ఒక దేశంలో గ్లేషియర్ కదలిక లేదా హిమ సరస్సు ఉప్పొంగడం మరో దేశంలోని నదీ ప్రవాహాన్ని ప్రభావితం చేయవచ్చు. అందుకే ఉపగ్రహ డేటా, వాతావరణ సమాచారం, హిమ సరస్సుల పరిస్థితి, నదీ నీటి మట్టాలు, వరద హెచ్చరికలను దేశాల మధ్య వేగంగా పంచుకునే వ్యవస్థ అవసరం. అదే సమయంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం, హిమాలయాల సున్నిత పర్యావరణ వ్యవస్థను కాపాడటం కూడా దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి.

విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి. ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలను నియంత్రించి, దేశాల మధ్య సమాచారాన్ని పంచుకోవాలి. ఇవే హిమాలయ భవిష్యత్తును, అక్కడి ప్రజల ప్రాణాలను కాపాడే కీలక మార్గాలు.

# ఘనంగా తెలుగు భాష క్రీడా దినోత్సవ వేడుకలు

- తెలుగు ఉపాధ్యాయులు, పీఈటీలకు ఘన సన్మానం
- రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని సి. సాయి ప్రణతికి అభినందనల జల్లు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ కె. మహేశ్వర రెడ్డి



**ప్యాపిలి – సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలం హుస్సేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం తెలుగు భాషా దినోత్సవం జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఒకే వేదికపై అత్యంత వైభవంగా నిర్వహించారు పాఠశాల ప్రధానోపా ధ్యాయులు హెడ్మాస్టర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ ఉమ్మడి సమావేశానికి మండల విద్యాశాఖాధికారి కె. మహేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ముందుగా గిడుగు రామమూర్తి మరియు మేజర్ ధ్యాన్ చంద్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె. మహేశ్వర రెడ్డి హెచ్‌ఎం బి. చంద్రమౌళి మాట్లాడుతూ... విద్యార్థుల సంపూర్ణ వికాసానికి మాతృభాష ఎంత అవసరమో శారీరక దృఢత్వానికి క్రీడలు అంతే ముఖ్యమని ఉద్ఘాటించారు. ఉపాధ్యాయులకు ఘన సన్మానం :ఈ దినోత్సవాల ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులను అటు భాషా రంగంలో ఇటు క్రీడా రంగంలో తీర్చిదిద్దుతున్న ముగ్గురు ఉపాధ్యాయులను విద్యాశాఖాధికారి ప్రధానోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు తెలుగు ఉపాధ్యాయులు బి. సర్వజ్ఞ మూర్తి,బి. సంధ్యారాణి వ్యాయామ ఉపాధ్యాయులు పి ఈ టి డి. మహేంద్రలను శాలువా, పూలమాలలు మెమొంటోలతో సభాముఖంగా ఘన సన్మానం చేశారు.



.రాష్ట్ర స్థాయి అండర్, 17 కబడ్డీ పోటీలకు ఎంపికైన సి. సాయి ప్రణతికి అభినందనలు:ఇదే వేదికపై పాఠశాలకు గర్వకారణంగా నిలిచిన 10వ తరగతి విద్యార్థిని సి. సాయి ప్రణతిని ఎంఈఓ, హెచ్‌ఎం ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-17 ( అండర్-17) కబడ్డీ విభాగంలో ఎంపికైన సాయి ప్రణతి ప్రతిభను కొనియాడారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆమెకు ప్రత్యేక బహుమతి అందజేశారు.

### వేడుకల్లో ముఖ్యాంశాలు

జాతీయ క్రీడా దినోత్సవం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్యాల పఠన పోటీలతో పాటు ఖో-ఖో, కబడ్డీ, పరుగు పందాల పోటీలు నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎం . రాగవేణి, జె దివాకర్,ఎం కంబగిరి, కె జయలక్ష్మి, బి , శ్రీకాంత్, బి మోహన్ రెడ్డి, జి వరలక్ష్మి, , వి విజయలక్ష్మి, చిన్న పుల్లయ్య. తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలచట్ల గ్రామంలో ఘనంగా రంగస్వామి ఊరేగింపు



**ప్యాపిలి – సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలంలోని కల చెట్ల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వెలసిన దేవరకొండ రంగస్వామి గత 60 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం శ్రావణమాసం నందు నాగుల పంచమి తర్వాత మూడవ వారంలో రంగస్వామి కొండమీద నుంచి భక్తిశ్రద్ధలతో ఒక పండుగలా స్వాములవారిని గ్రామంలో ఊరేగింపుగా ప్రతి గడవగడపకు ఊరేగింపుగా చేయడం ఆ కాలంనాటి నుండి ఆనవాయితుగా జరుగుతుంది స్వాములవారిని ఊరేగించినమరుక్షణం వరుణ దేవుడు కరుణించి వర్షం రావడం జరుగుతుంది అని గ్రామ ప్రజలు నమ్మకంతో ఎంతో ఘనంగా జరపడం జరుగుతుంది. శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు అన్న దాసోహం కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు శ్రావణమాసం ఉత్సవం కమిటి నిర్వాహకులు, పూజారులు తెలిపారు. కావున గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. ఈ సందర్భంగా శ్రావణమాసం ఉత్సవ కమిటి నిర్వాహకులు, యజమానులు, తదితరులు మాట్లాడుతూ.ప్రతి సం వత్సరం శ్రావణమాసం మూడవ శనివారం దేవరకొండ శ్రీ రంగస్వామి వారిని ప్రతి ఒక్కరూ పల్లకిని మోస్తూ, భజనలు చేస్తూ వరుణ దేవుడిని కరుణించి ఒక పండుగలా జరుపుకోవడం జరుగుతుంది. కొండమీద స్వాముల వారికి చేసినటువంటి ప్రసాదములు గ్రామంలో ప్రతి ఒక్కరికి అందజేయడం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# 14 లక్షల వ్యయంతో శాశ్వత తాగునీటి పైప్ లైన్

### - భూమిపూజ చేసిన ఎమ్మెల్యే జయ సూర్య ప్రకాష్ రెడ్డి

**బేతంచెర్ల – సూర్య వాస్తవం:** పట్టణంలోని సాయిబాబా గుడి సమీపం నుంచి రైల్వే గేట్ల వరకు రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన తాగునీటి పైపులైన్ పనుల కు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి భూమిపూజ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన తాగు నీటి ని అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీటి సర ఫరా మరింత మెరుగుపడేలా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ పైపులైన్ నిర్మాణం పూర్తయిన అనంతరం సంబంధిత ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా సౌకర్యవంతంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.



# అమృత్ 2.0 పథకం కింద పనులను నిర్ణయిత గడువులో పూర్తి చేయాలి

### - ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి



**బేతంచెర్ల – సూర్య వాస్తవం:** బేతంచర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. పట్టణంలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ పనులు, భూసేకరణ అంశాలు, విద్యుత్ స్తంభాల మార్పిడి, రహదారుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి వంటి అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు.అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న పనులు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే విధంగా ఉండాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమ న్వయం తో పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# అభివృద్ధి మా లక్ష్యం సంక్షేమమే మా ధ్యేయం

### - వై. నాగేశ్వరావు యాదవ్ కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ అండ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



**కర్నూల్ – సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, పాణ్యం కానిస్టియన్సీ ఎమ్మెల్యే చేరితారెడ్డి ఆధ్వర్యంలో గౌరూ జనార్దన్ రెడ్డి 31 వార్డ్‌లో "ఇంటింటికి తెలుగుదేశం--2026" కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటి పర్యటనలు చేపట్టారు. పాణ్యం కానిస్టియన్సీ 31 వార్డు బూత్ నశీ:- 151,152,139,141,142 పరిధిలో ఇంటింటి పర్యటనలు నిర్వహించి ప్రజల సమస్యలు అవసరాలు అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ శైలజ యాదవ్ యూనిట్ ఇన్‌చార్జ్ ఏ మల్లికార్జున క్లస్టర్ కో కన్వీనర్ పుల్లయ్య గౌడ్ తెలుగుదేశం పార్టీ నాయకులు రఘుగిరిధర్ యాదవ్ రేణుక, యేసు పాండు విజయ లాజ్ బాషా స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు

## సీఎం పర్యటన నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు...!

**- ట్రాఫిక్ నియంత్రణ,..వాహనాల మళ్లింపుపై స్పష్టమైన ఆదేశాలు**

**- విధులపై పోలీసు సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం**





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 30న అనంతపురం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. సీఎం పర్యటన బందోబస్తు విధులకు హాజరయ్యే పోలీసు అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ పి. జగదీష్ సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కేటాయించిన విధుల్లో ఏం చేయాలి.. ఏం చేయకూడదు అనే అంశాలపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. సీఎం ప్రయాణించే మార్గాల్లో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద భద్రత, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకల మళ్లింపు తదితర అంశాలపై అధికారులకు ప్రత్యేక దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఎం పర్యటన సురక్షితంగా, సజావుగా జరిగేలా అనంతపురం జిల్లా పోలీసు శాఖ పూర్తి అప్రమత్తతతో సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు.

## నందమూరి హరికృష్ణకు నివాళి అర్పించిన ఆర్థిక మంత్రి...!

**- అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించిన పయ్యావుల**

**- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న కేశవ్**



**అమరావతి – సూర్య వాస్తవం :** చైతన్య రథసారథి, దివంగత నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఘన నివాళులు అర్పించారు. హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.అనంతరం టీడీపీ జాతీయ కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన వినతులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజాదర్బార్ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా టీడీపీ జాతీయ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## హంద్రీనీవా కాలువకు గండి...!

**- రెండు మోటార్లు నిలిచిపోవడంతో పెరిగిన నీటి ఉద్ధృతి**

**ఉరవకొండ రూరల్ – సూర్య వాస్తవం :** వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువపై ఉన్న పంపింగ్ కేంద్రంలో రెండు మోటార్లు సాంకేతిక సమస్యతో నిలిచిపోయాయి. మొత్తం 12 మోటార్లు ఉండగా.. రెండు మోటార్లు పనిచేయకపోవడంతో పంపింగ్ కేంద్రం ఎగువ భాగంలో నీటి నిల్వ అధికమైంది. దీంతో ఛాయాపురం సమీపంలోని ఎస్కేప్ ఛానెల్ వద్ద ప్రధాన కాలువ కోతకు గురైంది. ప్రస్తుతం ప్రధాన కాలువలో సుమారు 2,800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. నీటి ఉద్ధృతిని తగ్గించేందుకు కర్నూలు జిల్లా మల్యాల పంపింగ్ కేంద్రంలో నీటి పంపింగ్‌ను తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్ హంద్రీనీవా ఉన్నతాధికారులను సూచించినట్లు సమాచారం.మరోవైపు రాగులపాడు పంపింగ్ కేంద్రంలో సాంకేతిక సమస్యకు గురైన రెండు మోటార్లకు మరమ్మతులు చేపట్టి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. కాలువ కోత నేపథ్యంలో అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్...!

- బస్సులు, ఆటోలు, రద్దీ ప్రాంతాల్లో చోరీలు..
- గుజిరీ ఏరుకునే ముసుగులో ఇళ్లను టార్గెట్
- 13 కేసులు ఛేదించిన జిల్లా పోలీసులు
- రూ.60 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ పి. జగదీష్



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** ప్రయాణికులు, మహిళలు, వృద్ధుల ధ్యాసను మళ్లించి బస్సులు, ఆటోలు, రద్దీ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు గుజిరీ ఏరుకునే ముసుగులో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్న మరో ముఠా సభ్యులను కూడా అదుపులోకి తీసుకున్నారు.నిందితుల నుంచి సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.1,49,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. శనివారం అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ జగదీష్ ముఠాల అరెస్ట్, కేసుల ఛేదన, స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలను వెల్లడించారు. ఈ అరెస్టులతో గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 11, అనంతపురం త్రీ టౌన్‌లో ఒకటి, ఉరవకొండలో ఒకటి.. మొత్తం 13 చోరీ కేసులు ఛేదించినట్లు తెలిపారు.




**బస్సులు, ఆటోల్లో ధ్యాస మళ్లించి..**

ముఠాలోని వనార్చి చిట్టెమ్మ బ్యాగ్ లిఫ్టింగ్ చోరీల్లో ఆరితేరిన పాత నేరస్తురాలని పోలీసులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలు, బస్సులు, ఆటోల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సహచరులతో కలిసి ప్రయాణికుల్లా నటించేవారని వివరించారు. ప్రయాణికుల ధ్యాసను మళ్లించి బ్యాగులు, పర్సుల్లోని విలువైన వస్తువులను అపహరించేవారని తెలిపారు.

**గుజిరీ ముసుగులో ఇళ్ల దొంగతనాలు**

మరో ముఠాలోని ఐదుగురు నిందితులు పరస్పరం బంధువులు, పరిచయస్తులుగా ఉన్నారని పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాగా ఏర్పడి, గుజిరీ ఏరుకునే ముసుగులో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు.

**పోలీసులకు ఎస్పీ అభినందనలు**

అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసులను వేగంగా ఛేదించిన గుత్తి సీఐ రామారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శేషగిరి, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బందిని ఎస్పీ పి. జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.

# అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మార్క్ అభివృద్ధి...!

- ఒకే రోజు రూ.6.84 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- స్మార్ట్ స్ట్రీట్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రొటెక్షన్ వాల్ పనులకు భూమి పూజలు
- పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అధికారులు, కూటమి నాయకులు



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మరో అడుగు ముందుకు వేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఒకే రోజు రికార్డు స్థాయిలో రూ.6.84 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, అధికారులు, కూటమి పార్టీల నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పలు ప్రాంతాల్లో భూమిపూజలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు నిర్వహించారు.బళ్లారి బైపాస్‌లోని అన్నా క్యాంటీన్ వద్ద రూ.4.50 కోట్లతో చేపట్టనున్న స్మార్ట్ స్ట్రీట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో రూ.16 లక్షలతో నూతన సీసీ రోడ్డు, 5వ డివిజన్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పీవీకేకే కళాశాల వద్ద రూ.15 లక్షలతో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు.అలాగే 8వ డివిజన్ రాణినగర్‌లోని ముత్యాలమ్మ గుడి వద్ద రూ.37 లక్షలతో నూతన సీసీ రోడ్డు, 24వ డివిజన్ జేఎన్‌టీయూ రోడ్డులోని హిందూ స్మశాన వాటిక వద్ద రూ.32 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అదే డివిజన్‌లోని ఓల్డ్ ఎస్‌బీఐ కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలో రూ.20 లక్షలతో నూతన సీసీ డ్రైయిన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.32, 26వ డివిజన్ల పరిధిలోని హమాలీ కాలనీలో ఇన్ఫినిటీ స్కూల్ వద్ద రూ.54 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్ పార్క్ వద్ద రూ.60 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. ఏడాది కాలంలోపు అనంతపురం నగర రూపురేఖలు మారే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించిన సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలిని ఆహ్వానించిన క్యాప్కో చైర్మన్ జి సురేష్ కుమార్...!

**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని అనంతపురం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి.సురేష్ కుమార్ ఆహ్వానించారు. శనివారం అనంతపురంలోని జిల్లా వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో అధ్యక్షురాలు ఎం. శ్రీలతను జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు టి. చెన్నప్ప, రాష్ట్ర ఈసీ సభ్యుడు చిన్న తంబి చిన్నప్ప, జిల్లా సభ్యుడు హసీన్ వలితో కలిసి సురేష్ కుమార్ ఆహ్వానించారు.ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల సమన్వయ మండలి, న్యూఢిల్లీ ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో 16వ జాతీయ వినియోగదారుల సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ రంగంలోని నిపుణులు, ప్రముఖులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నట్లు చెప్పారు.వినియోగదారుల హక్కుల పరిరక్షణ, వినియోగదారుల న్యాయం, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల అవగాహన, సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై సదస్సులో చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, పాల్గొనే ప్రతినిధులకు విలువైన మార్గదర్శకత్వం అందించాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సు ద్వారా వినియోగదారుల ఉద్యమానికి మరింత బలం చేకూరడంతో పాటు, వినియోగదారుల హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందుతుందని సురేష్ కుమార్ పేర్కొన్నారు



# రక్షక్ ప్రైమరీ స్కూల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం...!

**- క్రీడల్లో పాల్గొనడమే అసలైన విజయం: ఎస్పీ పి. జగదీష్**

**- చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి. జగదీష్ మార్గదర్శకత్వంలో రక్షక్ ప్రైమరీ స్కూల్లో ఆగస్టు 28, 29 తేదీల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల ముగింపు వేడుకలు శనివారం ఉత్సాహభరితంగా జరిగాయి. చిన్నారులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ.. గెలుపోటముల కంటే క్రీడల్లో పాల్గొనడం, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ముఖ్యమని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేసి అభినందించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలతో పాటు శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం పెంపొందుతాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపు ఒక్కటే కాదు.. పాల్గొనడం, నేర్చుకోవడం, ముందుకు సాగడమే అసలైన విజయం అని ఆయన అన్నారు.

## తెలుగు వాడుక భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో పెన్షనర్ల భవనంలో గిడుగు వెంకట రామ మూర్తి జయంతిని పెన్షనర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆ ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్ర పటా నికి కోశాధికారి జెన్నే కుల్లాయి బా బు పూల మాల వేసి నివాళులర్పిం చారు. సెక్రెటరీ రామ్ మోహన్ మా ట్లాడుతూ ఈయన తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు. ఈ యన తెలుగు వ్యావహారిక భాష కు మూల పురుషులు. బహు భాషా వే త్త,చరిత్ర కారులు,సంఘ సంస్కర్త. ఈయన గ్రాందీక భాషలు ఉన్న తె లుగు వచనాన్ని ప్రజలకు అర్థమ య్యే భాషలోకి తీసుకువచ్చి మన భాషలో ఉన్న అందాన్ని,వీలును తె లియ జెప్పిన మహనీయులు. వీరి కృషికి ప్రభుత్వం వీరిని కళా ప్రపూ ర్ణ,డాక్టరేట్ బిరుదులతో సత్కరించా రు. విద్యా శక్తి,కార్య దీక్ష,వీరి ప్రధాన లక్షణాలు. వీరు చిత్త శుద్ధితో తెలుగు భాషకు చేసిన సేవకు,కృషికి,ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వీరు పుట్టినరోజు ను తెలుగు భాషా దినోత్సవంగా ప్రక టించారు అని కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు తెలిపారు. ఈ కార్య క్రమంలో అసోసియేట్ స్వ ర్ణాంబా,కోశాధికారి జెన్నే కు ల్లాయి బాబు,సెక్రెటరీ రామ్ మోహన్,విజయ లక్ష్మి,నారా యణరెడ్డి,షైక్షావలి,లక్ష్మి నా రాయణ రెడ్డి,నారాయణ శె ట్టి,ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**- క్రీడలే ఆరోగ్యానికి సోపానం: సీఈవో సంతోష్ రెడ్డి**

**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణ పరిధిలోనీ శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి సీఈఓ సంతోష్ రెడ్డి నివాళులు అర్పించారు. సీఈఓ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ "గిడుగు వెంకట రామమూర్తి తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడని ఆయన గ్రాంథిక భాషకు బదులుగా ప్రజలు మాట్లాడే వాడుక భాషను సాహిత్యంలో తీసుకురావాలని కృషి చేశారని ఆయన జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తామని విద్యార్థులు తెలుగు భాష పట్ల గౌరవభావం పెంపొందించుకోవాలి" విద్యార్థులకు తెలియజేస్తూ "మన మాతృభాష తెలుగు గొప్పదనం ప్రపంచానికి తెలియజేయడం మనందరి బాధ్యతని విద్యార్థులకు తెలియజేశారు. అదేవిధంగా మేజర్ ధ్యాన్చంద్ గారి క్రీడా ప్రస్థానం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి కావాలని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రతిరోజూ ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు, కవితా పఠనాలు ప్రేక్షకులను ఎంత గానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# చెత్తకుప్పలో చిగురుటాకై... ముళ్లపొదల్లో మహాలక్ష్మి...!

- ఒకచోట సంచిలో.. మరోచోట ముళ్లపొదల్లో వదిలేసిన వైనం
- శిశువులను గుర్తించిన స్థానికుల మానవత్వం.. ఆసుపత్రికి తరలింపు
- అమ్మ ఒడిలో వెచ్చగా నిద్రించాల్సిన పసికందు.. చెత్తకుప్పలో చలికి వణికింది
- నాన్న చేతుల్లో మురిసిపోవాల్సిన చిన్నారి.. ముళ్లపొదల్లో కన్నీటి పర్యంతమైంది
- ఒడిలో ఉండాల్సిన బిడ్డను.. ఒంటరిగా వదిలేసిన కఠిన హృదయాలు
- అమ్మ ఆత్మీయ స్పర్శ కోసం ఎదురుచూస్తూ.. అనాథలుగా మిగిలిన పసి హృదయాలు





**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అమ్మ ఆత్మీయ స్పర్శతో లోకాన్ని చూడాల్సిన పసికందులు.. కన్నతల్లి ఒడికి దూరమై చెత్తకుప్పలు, ముళ్లపొదల్లో కళ్లు తెరిచారు. అప్పుడే పుట్టిన శిశువుల పట్ల కర్కశంగా వ్యవహరించిన ఘటనలు శ్రీ సత్యసాయి జిల్లాలో కలకలం రేపాయి. తనకల్లు మండలం చీకటిమానిపల్లిలో శుక్రవారం అప్పుడే పుట్టిన ఆడ శిశువును ఓ సంచిలో పెట్టి చెత్తకుప్పలో వదిలివెళ్లారు. అటుగా వెళ్తున్న కూలీలు చిన్నారి ఏడుపును గుర్తించి ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే శిశువును తనకల్లు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారికి ఎడమ కాలికి వైకల్యం ఉండటంతో పాటు ఉమ్మనీరు తాగిన కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు వైద్యుడు లోకేశ్వర్ రెడ్డి తెలిపారు.

మరో ఘటన ఆత్మకూరు మండలం పంపనూరు నగరవనం సమీపంలో చోటుచేసుకుంది. ముళ్లపొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఆడ శిశువును వదిలివెళ్లారు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు చిన్నారి ఏడుపు విని, తీవ్ర ఇబ్బందుల మధ్య శిశువును బయటకు తీసి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం శిశు సంరక్షణ కేంద్రానికి తరలించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ ఝాన్సీ తెలిపారు. వరలక్ష్మీ వ్రతం రోజునే.. ఓ చిన్ని మహాలక్ష్మి అనాథగా మారి సమాజం ముందుకు ఓ ప్రశ్నగా నిలిచింది. లోకం చూడకముందే నిర్లక్ష్యానికి గురైన ఈ పసికందుల ఘటనలు ప్రతి ఒక్కరి మనసును కలచి వేస్తున్నాయి. మరోవైపు, చిన్నారులను గుర్తించి ఆసుపత్రులకు తరలించిన స్థానికుల మానవత్వం అభినంద నీయం. ఈ ఘటనలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శిశువులను ఎవరు వదిలివెళ్లారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

# వైభవంగా శ్రీ కనుమ మీద ఆంజనేయస్వామి ఉత్సవాలు...!

- ఆకు పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించిన భక్తులు
- ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చెక్కభజన ప్రదర్శన





**పెద్దవడుగూరు - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం బంధార్లపల్లి గ్రామ సమీపం లోని కొండపై వెలసిన శ్రీ కనుమ మీద ఆంజనేయస్వామి శ్రావణమాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరి గాయి. ఈ సందర్భంగా బంధార్లపల్లి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తు లు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం గ్రామంలో స్వామివారి చిత్రపటాన్ని మేళతాళాలు, భజనల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం గ్రామానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని కొండపై ఉన్న శ్రీ కనుమ మీద ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు చేరుకున్నారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

### వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామస్తులు స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించారు. వర్షాలు లేక పంటలు సాగు చేయలేకపోవడంతో పాటు పశువులకు మేత కొరత ఏర్పడే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతులను ఆదుకోవాలని స్వామివారిని వేడుకున్నారు. రైతులపై స్వామివారి చల్లని చూపు ఉండాలని మొక్కుకున్నారు.

### ఆకట్టుకున్న చెక్కభజన

ఉత్సవాల్లో భాగంగా రమేష్--కళ్యాణి సమీరా బృందం నిర్వహించిన చెక్కభజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ వేషధారణ, లయబద్ధమైన అడుగులు, చెక్కల విన్యాసాలతో సాగిన ప్రదర్శనను చూసి పెద్దలు, యువత ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. పాత సంప్రదాయాలు క్రమంగా కనుమరుగవుతున్న తరుణంలో బంధార్లపల్లి యువత చెక్కభజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సంప్రదాయ కళలపై తమకున్న మక్కువను యువత ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పిందని అన్నారు. రమేష్--కళ్యాణి సమీరా చెక్కభజన బృందానికి చుట్టుపక్కల గ్రామాల్లో కూడా మంచి ఆదరణ ఉందని నిర్వాహకులు తెలిపారు.

### అన్నదానం.. కార్యక్రమం

చెక్కభజన అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారి సేవా కార్యక్రమాలు, చెక్కభజన, అన్నదాన ఏర్పాట్లను దగ్గరుండి నిర్వహించిన గ్రామ పెద్దలు, యువతకు బంధార్లపల్లి గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మేళతాళాలు, భజనలతో స్వామివారి ఆలయం నుంచి గ్రామానికి చేరుకుని, స్వామివారికి నిర్వహించిన ఆకు పూజలో ఉపయోగించిన తమలపాకులను గ్రామంలోని ప్రతి ఇంటికీ భక్తితో పంపిణీ చేయడం ఆనవాయితీగా నిర్వహించారు.

## ఆర్డీటీ సహకారంతో 22 మంది గ్రామీణ మహిళలకు ఆటోలు పంపిణీ...!

**- మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేయడమే లక్ష్యం**

**- అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు పిలుపు**

**- ఆర్డీటీ సేవలను అభినందించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా స్వావ లంబులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆర్డీటీ సహకారంతో 22 మంది గ్రామీణ ప్రాంత మహిళలకు ఆటోలను పంపిణీ చేశారు. అనంతపురం పట్టణంలోని ఆర్డీటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మహిళలకు ఆటోలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు ఆటోలు అందించడం ద్వారా వారికి స్థిరమైన జీవనోపాధి లభించడంతో పాటు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని అన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల సాధికారత కోసం ఆర్డీటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ప్రశం సించారు. ఆటోలను పొందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు ఉపాధి కల్పించే ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానో పా ధ్యాయులు రామకుమార్ ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు పద్య పఠనం, నాటికలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమావేశంలో తెలుగు భాష ప్రాధాన్యత, ఆవశ్యకత, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో తెలుగుబాష పోషిస్తున్న ప్రాధాన్యత గురించి తెలుగు ఉపాధ్యాయులు మల్లికార్జున, మస్తాన్ వలి, చంద్రబాబునాయుడు, కేశవరెడ్డి వివరించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం కూడా కావడంతో అందులోభాగంగా గత నాలుగు రోజుల నుండి వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, లాంగ్ జంప్, హైజంప్ మొదలైన అంశాల్లో పోటీలు నిర్వహించారు, నేడు ధ్యాన్ చంద్ జన్మదినశీ సందర్భంగా జాతీయక్రీడా దినోత్సవంగా నామకరణం చేశారు. ఇందుకుగాను విద్యార్థులకు బహుమతులు అందించారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రామకృష్ణ, నవీన్ కుమార్ నిత్యజీవితంలో క్రీడల ప్రాధాన్యత, ఆవశ్యకత గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామ కుమార్ పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# 104 చంద్రన్న సంచార వాహన శిబిరంలో ఆశాలే డాక్టర్లు



దొరవారిసత్రం -సూర్య వాస్తవం: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య సేవలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజల ముంగిటకే వైద్య సేవలు చేరువ చేయాలని అనేక పథకాలను అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా ప్రతి సచివాలయ పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్ ల ద్వారా సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా"ప్రత్యేకించి చంద్రన్న సంచార 104 వాహనం ద్వారా హ్యాబిటేషన్ల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు నిమిత్తం పలు ఆరోగ్య సేవలో అందించాలని ప్రభుత్వం 104 వాహనం ఏర్పాటు చేసింది.అయితే దొరవారిసత్రం మండల పరిధిలోని తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 104 సంచార వైద్య సేవలు నామమాత్రంగానే అందుతున్నాయని ఆయా గ్రామాల నుండి ఫిర్యాదులతో కూడిన ఆరోపణలు కూడా ఉన్నాయి.104 వాహన వైద్య శిబిరంలో విధిగా డాక్టర్,ఎం ఎల్ హెచ్ పి,ఏఎన్ఎం,డిఇఓ లతోపాటు ఆ పరిధిలోని ఆశా కార్యకర్తలు సహాయకులుగా హాజరు కావాలి.కానీ శనివారం తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న తల్లంపాడు ఉపకేంద్రం,మావిళ్ళపాడులో జరిగిన చంద్రన్న సంచార వైద్య శిబిరంలో ఆశా కార్యకర్తలే డాక్టర్లుగా వ్యవహరించారు.రోగులను పరీక్షించేందుకు డాక్టర్,ఎం ఎల్ హెచ్ పి,ఏఎన్ఎం ఎవరూ హాజరు కాకపోవడంతో వచ్చిన రోగులను తిరిగి పంపలేక బిపి,షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించి పంపించారు.ప్రధానంగా వైద్యాధికారి పర్యవేక్షణలో పరీక్షలు చేసి, రోగస్థాయి వ్యత్యాసాలను బట్టి మందులు మార్పు చేయడమా,మోతాదు తగ్గించడమా,వారి అనుమానాలు నివృత్తి చేసి,ఆహార-ఆరోగ్య సలహాలు ఇవ్వాలి.వచ్చిన ఓపి రోగుల వివరాలను కూడా ఆన్లైన్లో నమోదు చేయాలి.

ఆ పరిధిలో ఉన్న గర్భవతులను కూడా పరీక్షించి,బాలింతలకు సలహాలు ఇవ్వాలి.పలు రకాల వైద్య పరీక్షలు చేపడితేనే ప్రభుత్వ ఆశయం నెరవేరి అవకాశం ఉంది.ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 104 వైద్య సేవల శిబిరాల్లో వైద్యులు సమయపాలన పాటించక, పలు పర్యాయాలు హాజరుకాక గ్రామీణ రోగులకు వైద్యుని పర్యవేక్షణలో ఆరోగ్య సేవలు అందడం లేదనే ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. సంబంధం లేని ఆశా కార్యకర్తలే డాక్టర్లుగా, నర్సులుగా చలామణి అవ్వడం పై గ్రామాల్లో కూడా చర్చించుకుంటున్నారు.సంబంధిత జిల్లా అధికారులు పర్యవేక్షణ చేపట్టి ప్రభుత్వ ఆశయంతో పాటు, ప్రజలకు సంచార వైద్యశాల104 ద్వారా అందు బాటులోనే మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# గంజాయి, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**- బాల్య వివాహాలు, మహిళలపై నేరాల నివారణకు సత్యవేడు పోలీసుల అవగాహన- నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం.- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.పోలీసుల సూచన**



దొరవారిసత్రం -సూర్య వాస్తవం: తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాల నివారణ,ప్రజల భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీసు శాఖ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సత్యవేడు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగం,సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళలపై నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి,ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను,ముఖ్యంగా యువత ఆరోగ్యం, విద్య, కుటుంబం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను పోలీసు అధికారులు వివరించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.అలాగే సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని,ఓటీపీ,పిన్,పాస్వర్డ్లు, బ్యాంకు ఖాతా వివరాలు,వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్లకు స్పందించకుండా జాగ్రత్త వహించాలని అవగాహన కల్పించారు.బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, బాలల విద్య,భద్రత,హక్కులు మరియు భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.మహిళలపై వేధింపులు,హింస లేదా ఇతర నేరాలు చోటుచేసుకుంటే భయ పడకుండా పోలీసులను ఆశ్రయించాలని, బాధితులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు శాఖ నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని,నేరాలకు సంబంధించిన సమా చారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్కు తెలియ జేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సత్యవేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులతో

# గిడుగు వెంకట రామమూర్తి జయంతి వార్షికోత్సవం



దొరవారిసత్రం -సూర్య వాస్తవం: ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వార్షికోత్సవం మరియు తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని గిడుగు వెంకట రామమూర్తి సేవలను, తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు భావితరాలకు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సంఘం అధ్యక్షులు డాక్టర్ రాజన్న గారు, ప్రముఖ తెలుగు కవి ఆది గారు, ఏపీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఆపేవైడక్) డైరెక్టర్ నాగముని, కర్నూలు ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ కె.వి.సుబ్బారెడ్డి డీఎస్పీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

**"తెలుగు భాష పరిరక్షణకు ప్రతిజ్ఞ"**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో పాటు తెలుగు సంఘాల సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రజలు కలిసి తెలుగు భాషను గౌరవిస్తూ,తెలుగు భాష అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తెలుగు భాషను నిత్య జీవితంలో మరింతగా ఉపయోగిస్తూ, భావితరాలకు తెలుగు భాష గొప్పతనాన్ని అందించాలని ప్రతిజ్ఞ చేశారు.ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్కు సన్మానంప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ గారు విద్యా రంగంలో, విద్యార్థుల అభివృద్ధిలో చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి కార్యక్రమంలో ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. కళాశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో విద్యా ర్థులను భాగస్వామ్యం చేయడం వంటి అంశాల్లో ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు అభినం దించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్చంద్ స్మరణ అదే సంద ర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని కూడా నిర్వహించి, భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్చంద్ జయంతిని స్మరించుకున్నారు.భారత హాకీ క్రీడకు ధ్యాన్చంద్ అందించిన విశిష్ట సేవలను, ఆయన క్రీడా ప్రతిభను గుర్తు చేసుకున్నారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొని శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణను పెంపొందించుకోవాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు కళాశాల సిబ్బంది విజయశేఖర్,శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు. కార్యక్రమం తెలుగు భాష పట్ల విద్యార్థుల్లో మరింత అవగాహన, అభిమానం పెంపొందించేలా ఉత్సాహంగా సాగింది.

# లారీని ఢీకొని స్కూటరిస్ట్ మృతి



దొరవారిసత్రం -సూర్య వాస్తవం: కలకత్తా-చెన్నై జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతి చెందాడు.వివరాల మేరకు మృతుడు స్వగ్రామం ప్రకాశం జిల్లా,మాధవరం గ్రామానికి చెందిన రాపూరు.ఏడుకొండలు (21) ఇతను చెన్నై నుండి ఏపీ40/యూ 2692 నెంబరు గల బైక్ పై చెన్నై నుండి బయలుదేరి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో అదుపుతప్పి కుప్పారెడ్డిపాలెం గ్రామ సమీపంలోని ధాబా వద్ద లారీని ఢీకొనడం జరిగింది. ఈ సంఘటనలో రాపూరు ఏడుకొండలు ఘటనా స్థలంలోని మృతి చెందాడు. ఈ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సంఘటనపై దొరవారిసత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఘనంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు



దొరవారిసత్రం -సూర్య వాస్తవం: మండల పరిధిలోని మోడల్ ప్రైమరీ పాఠశాల తల్లంపాడు నందు తెలుగుభాషా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలు అందరికి తల్లంపాడు పూర్వ విద్యార్థి చింతపూడి వీరాస్వామి వాటర్ బాటిల్స్ మరియు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఎంఈఓ-1,కే.కొండయ్య చేతులు మీదుగా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంఈఓ కొండయ్య మాట్లాడుతూ,పిల్లలు తెలుగు బాగా చదవాలి మాతృభాష నేర్చుకో వాలి,క్రీడలు ద్వారా ఆరోగ్యం గా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు వి.రవికుమార్ ఉపాధ్యాయులు టి.హుస్సేన్ బాబు,వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక నైపుణ్యాల పెంపుదల అవసరం

**- కేసుల శీఘ్ర ఛేదన,నాణ్యమైన దర్యాప్తుకు డిజిటల్ ఫోరెన్సిక్స్ కీలకం**

**- కొత్త టెక్నాలజీని వినియోగిస్తున్న నేరస్థుల కంటే పోలీసులు ఒక అడుగు ముందుండాలి**

**- 100 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బందికి సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫొరెంజిక్స్ శిక్షణ**



దొరవారిసత్రం -సూర్య వాస్తవం: సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని,వాటి నియంత్రణతో పాటు కేసుల శీఘ్ర ఛేదనకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీవో) కాన్ఫరెన్స్ హాల్లో నీలిట్ తిరుపతి సౌజన్యంతో నిర్వహించిన సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫొరెంజిక్స్ ట్రైనింగ్ ప్రోగ్రాము ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై,శిక్షణ పూర్తి చేసుకున్న 100 మందికి పైగా పోలీసు అధికారులు,సిబ్బందిని అభినందిం చారునేరస్థులు డిజిటల్ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ ఫేక్ న్యూస్,నకిలీ లింకులు,ఆన్లైన్ ఫ్రాడ్స్, సైబర్ మోసాలకు పాల్పడుతున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డిజిటల్ ఆధారాల సేకరణ,విశ్లేషణతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా కేసుల శీఘ్ర ఛేదన,నాణ్యమైన దర్యాప్తు సాధ్యమ వుతుందని తెలిపారు.సైబర్ నేరాల కొత్త పద్ధతులకు అనుగుణంగా పోలీసులు తమ సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం అప్డేట్ చేసుకుని,ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించిన నీలిట్ తిరుపతి డైరెక్టర్ శివకుమార్, ఫ్యాకల్టీ సభ్యులు అఖిల్,మనీష్ యాదవ్లకు ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు.శిక్షణ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన అడిషనల్ ఎస్పీ శ్రీ ఐ.రామకృష్ణ (తిరుమల),సైబర్ టీమ్ ఇన్స్పెక్టర్ వినోద్,ఐటీ కోర్ సిబ్బందిని అభినందించారు.





# ఎల్లమ్మకు ఓకే..!



విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న 'బలగం' చిత్రం తర్వాత, జాతీయ అవార్డు గ్రహీత వేణు యెల్దండి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సమర్పణలో, శిరీష్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం, బలమైన భావోద్వేగాలను, సాంస్కృతిక నేపథ్యాన్ని మిళితం చేస్తూ సాగుతుంది. రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించడంతో పాటు హీరోగా పరిచయమతున్నారు. ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు. అయితే, ఈ సినిమాలో కథానాయిక ఎవరనే విషయమై చాలా రోజులుగా చాలా మంది హీరోయిన్ల పేర్లు వినిపిస్తూ వస్తున్నాయి. తొలిసారి కథానాయకుడిగా తెరపై అలరించేందుకు సిద్ధమతున్న దేవిశ్రీకి ఎవరు హీరోయిన్‌గా సెట్ అవుతారనే విషయమై ఫిల్మ్ సర్కిళ్లలో చర్చలు జరిగాయి. సాయిపల్లవి, కీర్తి సురేశ్, మృణాల్ ఠాకూర్‌ల పేర్లు బాగా వినిపించాయి. తాజాగా యువ కథానాయిక అనంతిక సనీల్‌కుమార్ పేరు తెరపైకి వచ్చింది. 'మ్యాడ్'లో ఆకట్టుకున్న ఈ బ్యూటీ ఆ తర్వాత '8 వసంతాలు'తో మంచి పేరు తెచ్చుకుంది. 'రోమాంచకం' అంటూ త్వరలో సుమంత్ ప్రభాస్‌తో ప్రేక్ష కులను పలుకరించ నుంది. తాజాగా ఈ బ్యూటీని 'ఎల్లమ్మ' టీమ్ ఓకే చేసిందని, ఇటీవలే టెస్ట్ కట్ జరిగిందని సమాచారం.

# ఏష నాగుల కట్ట మీద..




నేచురల్ స్టార్ నాని పాన్ ఇండియా యాక్షన్ ఎక్స్‌ట్రావ్యాగెంజా 'ది ప్యారడైజ్' ఇప్పటికే పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ 'ఆయా షేర్', ఇటీవల విడుదలైన టీజర్‌తో భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎకస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 'ఆయా షేర్'కు వచ్చిన మంచి స్పందన తర్వాత మేకర్స్ 'ఏష నాగుల'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. జానపద బాణీకి సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్ర హై-ఎనర్జీ మ్యూజిక్‌ను జోడించిన ఈ పాటను డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ కాన్సర్ట్ లైవ్‌గా విడుదల చేశారు. ఇప్పటికే పాపులర్ అయిన ఫోక్ నంబర్‌కు అనిరుధ్ మరింత గ్రాండ్, సినిమాటిక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పాట మూడ్‌కు పర్ఫెక్ట్‌గా సరిపోయాయి. జంగిరెడ్డి వోకల్స్ పాటకు అథెంటిక్ రస్టిక్ టచ్‌ను అందించగా, ప్రభా తన వోకల్స్ పాటలోని ఎనర్జీని మరింత పెంచారు. ఈ డ్యాన్స్ పోర్షన్‌కు నాని, కీర్తి సురేశ్ కాంబో మరింత ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాలో మోహన్‌బాబు, కాయదు లోహర్, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సెప్టెంబర్ 24న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ సహా ఎనిమిది భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి డీవోపీ: సీహెచ్ సాయి; ఎడిటింగ్: నవీన్ నూలి; ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా.

# ఆ నమ్మకంతోనే ఒప్పుకున్నా!



కోలీవుడ్ యువ కథానాయకుడు సూరి, టాలీవుడ్ స్టార్ హీరో సుహాస్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'మండాడి'. దర్శకుడు మతిమారన్ పుగళేంది ఈ చిత్రాన్ని పూర్తి సముద్రం నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటి స్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలలో కనిపించనున్నారు. సెప్టెంబర్ 10న థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ మహిమా నంబియార్ తన రోల్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "డైరెక్టర్ మతిమారన్ నాకు వీడియో కాల్‌లోనే కథ మొత్తం చెప్పారు. మొదట్లో కథ విన్నప్పుడు ఈ క్యారెక్టర్ నేను చేయగలనా..? లేదా? అనే సందేహం వచ్చింది. దీంతో కొన్ని రోజులు ఆ భయంలోనే ఉండిపోయా. అయితే లుక్ టెస్ట్ చేసిన నాపై నాకు నమ్మకం పెరిగింది. ఆ లుక్ టెస్ట్ ఇచ్చిన కాన్ఫిడెన్స్‌తోనే ఈ పాత్రకు పూర్తి న్యాయం చేయగలనని భావించి సినిమా ఒప్పుకున్నా" అని చెప్పుకొచ్చింది మహిమా.



# స్వదేశీ మ్యాచ్‌లకు స్పాన్సర్ల కరవు




**ముంబై, ఆగస్టు 29:** ప్రపంచ క్రికెట్‌లో ధనిక బోర్డుగా పేరున్న బీసీసీఐతో ఒప్పందాల కోసం, భారత్ జట్టు స్పాన్సర్ షిప్ కోసం ఒకప్పుడు ఎంతో క్రేజ్ ఉండేది. అయితే ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం పరిస్థితులతో ఇప్పుడు స్పాన్సర్ షిప్ ఇచ్చేందుకు కంపెనీలు మునుపటిలా ఎగబడడం లేదు. ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నాయి. తాజాగా టీమిండియా స్వదేశ ంతో అదే మ్యాచ్‌లకు స్పాన్సర్ల కోసం బీసీసీఐ బిడ్లను ఆహ్వానించగా అనుకున్న స్థాయి లో స్పందన రాలేదు. బిడ్ల దాఖలుకు గడు వు ఆగస్టు 13తో ముగిసినా.. ఇప్పటివరకు బోర్డు కొత్త స్పాన్సర్‌ను ఖరారు చేయలేదు. ప్రస్తుతం పలువురు సంస్థలతో బీసీసీఐ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. గూగు ల్ జెమినీ, స్విస్నీ, ఎస్బీఐ లైఫ్ వంటి సంస్థల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రెండు వారాలు గడిచినా కొత్త స్పాన్సర్‌పై స్పష్టత రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రస్తుతం టీమిండియా స్వదేశీ మ్యాచ్‌ల టైటిల్ హక్కులు ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ వద్ద ఉన్నాయి. ఒక్కో మ్యాచ్‌కు ఆ సంస్థ బీసీసీఐకి రూ. 4.2 కోట్లు చెల్లిస్తోంది. అయితే కొత్త బిడ్డింగ్‌లో బీసీసీఐ కనీస ధరను రూ. 4.75 కోట్లుగా నిర్ణయించింది. ఈ పెరిగిన బేస్ ప్రైస్ కారణంగానే సంస్థలు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోం ది. కొత్త ఒప్పందం రెండేళ్ల పాటు.. అంటే 2028 మార్చి 31 వరకు కొనసాగనుంది. గతంలో ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ మూడేళ్ల ఒప్పందాన్ని దక్కించుకుంది.

తాజా ఒప్పందం ప్రకారం సుమారు 35 మ్యాచ్లకు టైటిల్ స్పాన్సర్ హక్కులు లభిస్తాయి. దీనిలో 10 టెస్టులు, 12 వన్డేలు, 13 టీ20లున్నాయి. బిడ్డర్‌కు గత మూడు ఆడిట్ చేసిన ఆర్థిక సంవత్సరాల్లో సగటు టర్నోవర్ కనీసం రూ. 100 కోట్లు ఉండాలి. లేదా అదే కాలానికి సగటు నికర విలువ కనీసం రూ. 100 కోట్లు ఉండాలని బీసీసీఐ నిబంధనల్లో పేర్కొంది. ఈ నిబంధనలు, పెరిగిన బేస్ ప్రైస్ కారణంగా బీసీసీఐకి కొత్త టైటిల్ స్పాన్సర్ ను ఖరారు చేయడం ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.



# సెలెక్టర్ల నిర్ణయం షాకిచ్చింది

ముంబై , ఆగస్టు 29: భారత టీ20 జట్టు కెప్టెన్సీ మార్పు తనను జట్టు నుంచి తొలగించడంపై స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ తొలిసారి మౌనం వీడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సారథ్యంలో భారత్ కు ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ అందించినప్పటికీ, సెలెక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయం తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా యూట్యూబ్ చానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్యకుమార్ వెల్లడించాడు. ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల కోసం ప్రకటించిన జట్టులో తన పేరు లేదని తెలిసినప్పుడు మొదట తనకు నవ్వొచ్చిందని సూర్య చెప్పాడు. కెరీర్‌లో ఎలాంటి ఒత్తిడి పరిస్థితులు ఎదురైనా నవ్వుతూ ప్ర శాంతంగా ఉండటం తనకు అలవాటని పేర్కొన్నాడు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత కూడా ఇలాంటి నిర్ణయం వస్తుందని అస్సలు ఊహించలేదని ఇది ఎలా సాధ్యం? అసలు ఎలా జరిగింది? అనే ప్రశ్నలు తనను తీవ్రంగా వేధించాయని ఒప్పుకున్నాడు. అన్నీ సవ్యంగా సాగుతున్న క్షణంలో, అకస్మాత్తుగా మార్పు ఎందుకు అని, దానికి కార ణం ఏంటో, మార్పునకు కారణం ఏంటో తెలియదన్నాడు. 2026 వరల్డ్ కప్ సాధించిన తర్వాత మరో రెండేళ్లు తానే జట్టును ముందుకు నడిపిస్తానని, ఒలింపిక్స్‌లో కూడా జట్టుకు సారథ్యం వహిస్తానని భావించినట్లు సూర్య తెలిపాడు. తన ఆలోచనలకు, సెలెక్టర్ల ఆలోచనలకు తేడా ఉంటుందని.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించడం మంచిదని వారు భావిస్తే, ఆ నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని చెప్పాడు. గత కొంతకాలంగా తన బ్యాటింగ్ ఫామ్ ఆశించిన స్థాయిలో లేదని, జట్టు ప్రకటనకు రెండు రోజుల ముందే సెలెక్టర్లు తనతో మాట్లాడి ముం దుకు వెళ్లాల్సిన సమయం వచ్చిందని చెప్పినట్లు సూర్య వెల్లడించాడు. ప్రస్తుతం తిరిగి జట్టులోకి రావడం కోసం కష్టపడుతున్నానని తెలిపాడు.

# ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**-గవర్నర్ కిరణ్ కుమార్ రెడ్డికి**

**డా. కుంచం వెంకట సుబ్బారెడ్డి శుభాకాంక్షలు**



**కడప - సూర్య వాస్తవం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి గవర్నర్ పదవి లభించిన సందర్భంగా రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... రాజకీయ, ప్రజా జీవితంలో సుదీర్ఘ అను భవం కలిగిన కిరణ్ కుమార్ రెడ్డి గవర్నర్‌గా తన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తిం చాలని ఆకాం క్షించారు. ఆయనకు లభించిన ఈ గౌరవప్రదమైన పదవి ప్రజాసేవకు మరింత అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజలకు, దేశానికి సేవలందించాలని డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి ఆకాంక్షించారు.

# డ్రోన్ కెమెరాలతో నిఘా



**రాజంపేట-సూర్య వాస్తవం:**
మండలం పరిదిలోని మల్లెంపల్లి, జెట్టివారిపల్లి, తుమ్మకొండ గ్రామాల్లో శనివారం డ్రోన్ కెమెరాలు ఎగురవేసి గ్రామాల శివారుప్రాంతాలు అనుమానాస్పదప్రదేశాలపై విశృనిఘా ఏర్పాటు చేశారు. ముక్యంగా పేకాట స్థావరాలు, కోళ్లపందెలు నిర్వహించే ప్రదేశాలు, గంజాయినిల్వ, వినియోగానికి సంబంధించిన అనుమా నాస్పద ప్రాంతాలు బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలు తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. డ్రోన్ నిఘా ధ్వారా గుర్తించిన అనుమానాస్పద ప్రదేశాలు, కథలికల పై వేంటనే స్పందించి చర్యలు చెపడతామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాల నిచిట్వేలి పోలీసులు కోరారు.

# యువ నాయకుడు జోగయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం




**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ యువ నాయకుడు, విద్యావంతుడు, సామాజికవేత్త పాత జోగాళ్ల జోగయ్యకు గౌరవ డాక్టరేట్ లభించింది. పాండిచ్చేరి రాష్ట్రంలోని ప్రముఖ అమెరికన్ విశ్వవిద్యాలయం సామాజిక విభాగంలో ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్న జోగయ్యకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోగయ్యకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జోగయ్య మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి, సమాజ సేవలో మరింతగా రాణించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

# ఘనంగా మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు




**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** బ్రహ్మంగారి మఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.ఎల్. రవీంద్రారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కె. వల్లి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, తెలుగు అధ్యాపకులు ముండ్లపాటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మాతృభాష ఎంతో గొప్పదని, అమ్మను ఏ విధంగా గౌరవిస్తామో మాతృభాషను కూడా అదే విధంగా గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. పరభాషా వ్యామోహంతో తెలుగు భాషను మరువకూడదన్నారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29ను మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ముడియం గురుస్వప్న, తెలుగు అధ్యాపకురాలు మమత మాట్లాడుతూ ఇతర భాషలను నేర్చుకోవడం తప్పుకాదని, అయితే వాటిపై మోజుతో మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఇతర భాషలను అభ్యసిస్తూనే తెలుగు భాషపై మమకారాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు, భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాలసుబ్బయ్య, రమణ, శోభారాణి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒకటో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో “వార్డు బాట”

## - “మీ సంక్షేమం -- మా బాధ్యత”




**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, ప్రొద్దుటూరు సబ్-డివిజన్ ఏఎస్పీ విభూ కృష్ణ పర్యవేక్షణలో, ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో “వార్డు బాట” కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కాలేజ్ సర్కిల్ నందు వార్డు సభ శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఒకటో పట్టణ సీఐ కొండారెడ్డి, ఎస్ఐ మధుసూదన్ రెడ్డితో కలిసి స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్, వ్యభిచారం, గంజాయి, సైబర్ క్రైమ్ వంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు. అలాగే రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని, ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఏవైనా నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు లేదా అనుమానాస్పద విషయాలపై సమాచారం ఉన్నట్లయితే ప్రజలు క్రింది నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ -- 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ -- 1930, గంజాయి సంబంధిత సమాచారం -- 1972. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీసులు నిరంతరం కృషి చేస్తారని సీఐ కొండారెడ్డి తెలిపారు.

# మానవత్వమే మతంగా..

# గుర్తుతెలియని వ్యక్తికి అంతిమ సంస్కారాలు



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** ఎర్రగుంట్ల బస్ స్టాండ్‌లో అనారోగ్యం చేత మరణించిన మృతదేహాన్ని ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నందు ఉంచగా అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబాహన్, అశోక్,సతీష్ ,గౌస్,పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్దులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే 82972 53484, 9182244150 ఈ నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.

# నేపాల్‌లో జరిగిన సంఘటన బాధాకరం

**- అక్కడ ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జనసేన యువనాయకులు ఆనాల సునీల్ కుమార్**

**రాజంపేట - సూర్య వాస్తవం :** నేపాల్ లో జరిగిన సంఘటన మనిషిగా తనను తీవ్రంగా బాధ కలిగించిందని జనసేన యువనాయకులు ఆనాల సునీల్ కుమార్ అన్నారు. అక్కడ చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా భారతదేశాన్ని తిరిగి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. కచ్చితంగా వారందరినీ క్షేమంగా తీసుకురావడానికి ప్రాణాలు కోల్పోయిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని ఇంకా కూడా సమాచారం తెలియని చాలామంది ఉన్నారు. కాబట్టి వారందరినీ కూడా కేంద్ర ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో చర్చలు జరిపి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసి ఇబ్బంది పడుతున్న ప్రజలకు అండగా ఉండాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఎంతోమంది అభం శుభం తెలియ నటువంటి వ్యక్తులు ఏం జరుగుతుందని ఊహించుకునే లోపే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఇంతటి ఘోరమైన సంఘటనను తను ఎప్పుడూ చూడలేదని ఆయన బాధాతప్త హృదయాలతో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాడు ప్రకృతి ఈ స్థాయిలో కన్నెర చేస్తుందని ఊహించలేదన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : M. SULEMAN SAHEB H. No 158/56 UMA NAGAR, ANANTHAPURAM ANDHRA PRADESH - 515001. CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# డ్రోన్ ద్వారా రక్త నమూనాల రవాణా...

**- గన్నెల పీహెచ్‌సీని సందర్శించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు,మంత్రి సత్య కుమార్**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ పరిధిలోని గన్నెల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్)రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో కలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా రక్త నమూనాలను రవాణా చేసే ఆధునిక విధానాన్ని వారు ప్రత్యక్షంగా పరిశీలించారు.మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర వేళల్లో సకాలంలో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్న తీరును ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు.

# పునబాకలో ప్రభుత్వ పోరంబోకు భూమిపై మళ్లీ ఆక్రమణ యత్నం

**- కలెక్టర్ ఆదేశాలతో గతంలో ఆక్రమణ తొలగింపు..**
**- హెచ్చరిక బోర్డును తొలగించి గ్రావెల్‌తో చదును చేస్తున్నారంటున్న గ్రామస్తులు**





**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండలం పునబాక గ్రామ పరిధిలోని ప్రభుత్వ పోరంబోకు భూమిని కొందరు వ్యక్తులు మళ్లీ ఆక్రమించేందుకు ప్రయత్ని స్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు పెళ్లకూరు మండల తహసీల్దార్‌కు గ్రామస్తులు హృదయపూర్వకంగా వినతిపత్రం సమర్పించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పునబాక గ్రామ రెవెన్యూ పరిధిలోని 2006--10 సర్వే నంబర్‌లో 0.65 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమి ఉందని తెలిపారు. ఈ భూమి ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నప్పటికీ, కొందరు వ్యక్తులు దానిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ గ్రావెల్ తరలించి భూమిని చదును చేస్తున్నారని పేర్కొన్నారు.

**2018లోనే ఆక్రమణ తొలగింపు**

గతంలో కూడా ఇదే భూమిపై ఆక్రమణకు ప్రయత్నం జరగగా, 2018లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణను తొలగించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అయితే ప్రస్తుతం ఆ హెచ్చరిక బోర్డును తొలగించి, ప్రభుత్వ భూమిని మళ్లీ ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించి, ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవాలని వారు కోరారు.

**ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి**

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణ తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణ యత్నాలపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో కె. సూరిరెడ్డి, మాజీ సర్పంచ్ నీలం కృష్ణయ్య, నీలం నర్సయ్య, అట్ల కృష్ణయ్య, అట్ల నవీన్, పేరతూరు మౌలిష్, మళ్లయ్య, గురవయ్యతో పాటు పలువురు గ్రామస్తులు ఉన్నారు.

# కంబగిరి స్వామిని దర్శించుకున్న కోట్ల సుజాతమ్మ



**ప్యాపిలి- సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలంలోని రాచర్ల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల మధ్య వెలసిన ప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రం శ్రీ కంబగిరి స్వామి ఆలయాన్ని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు సుజాతమ్మ కి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

# కల్లూరు పంచాయతీ సర్పంచుగా నామినేషన్ చేస్తా.

**- ఎన్నికలలో రాజీ రాజకీయాలకు అవకాశం ఇవ్వను (సింహా)**



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలంలోని కల్లూరు ఆర్ఎస్ సర్పంచ్ ఎన్నికలలో గ్రామ సర్పంచుగా నామినేషన్ చేస్తానని ఎగువపల్లి సింహ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. నామినేషన్ చేయుటలో రాజీ ప్రసక్తే ఉండదని కరాకంటిగా ఆయన నిర్ణయాన్ని వ్యక్తపరిచారు. ప్రజా సేవలకు వ్యక్తిత్వానికి ప్రజలు పట్టం కట్టాలని అందులో భాగంగా నాకు ఒకసారి అవకాశం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, వైద్య సిబ్బంది, ప్రజలు,కలిసి భాగస్వాములు కావాలి

**- "ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్"**






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, వైద్య సిబ్బంది, ప్రజలు, కలిసి భాగస్వామ్యాలు కావాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు.ఆయన శనివారంఅరకులోని గన్నెల గ్రామంలో ప్రజా వేదిక వద్ద నిర్వహించిన "సంజీవని కార్యక్రమంలో"మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, ఆధునిక పరికరాల లభ్యత పెరగడంతో ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఏరియా,సెకండరీ ఆసుపత్రులపై ప్రజల సంతృప్తి గతంలో 60--62% ఉండగా,ప్రస్తుతం 76--80% కు పెరిగిందని,దీనిని 85--90%కు తీసుకెళ్లే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో ఓపీ సేవలు నెలకు 16--18 వేల నుంచి 22--24 వేలకు పెరిగాయని, ఆధునిక వైద్య పరికరాలు,డయాలసిస్,బ్లడ్ సెంటర్ వంటి సేవలను అందుబాటులోకి తీసు కువచ్చామని వివరించారు.అలాగే ఉచిత వైద్య శిబిరాల ద్వారా 25 మందికి రూ.1 కోటి విలువైన మోకాళ్ల శస్త్రచికిత్సలు,257 మందికి రూ.2.5 కోట్ల విలువైన కంటి శస్త్రచికిత్సలు అందించామని తెలిపారు.అబ్బా ఐడి ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను అందుబాటులోకి తీసుకువచ్చి, భవిష్యత్తులో రోగులకు మరింత వేగంగా,సమర్థవంతంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, వైద్య సిబ్బంది, ప్రజలు కలిసి భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

# వాకింగ్‌కు వెళ్లి.. విగతజీవిగా తిరిగొచ్చిన విద్యార్థి

**- మృత్యువులా దూసుకొచ్చిన దోస్త్**
**- పెన్నేపల్లి వద్ద డివైడర్‌పై కూర్చున్న ముగ్గురిపైకి దూసుకొచ్చిన వాహనం.. ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు**



**పెళ్లకూరు-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి సర్వీస్ రోడ్ పై ఉదయం వేళ వాకింగ్‌కు వెళ్లిన ముగ్గురు ఇంటర్ విద్యార్థులను మృత్యువు వెంటాడింది. డివైడర్‌పై కూర్చొని సేదతీరుతున్న విద్యార్థులపైకి ఓ దోస్త్ సరుకుల వాహనం అదుపుతప్పి దూసుకురావడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బీహార్‌కు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆదిత్య బాంబయ్య అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన పెళ్లకూరు మండలం పెన్నేపల్లి సమీపంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో శనివారం ఉదయం చోటుచేసుకుంది.

**వాకింగ్ కోసం వెళ్లి.. విషాదం**

నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆదిత్య బాంబయ్య, బ్రహ్మయ్య, మన్విష్ ముగ్గురూ శనివారం ఉదయం వాకింగ్ కోసం పెన్నేపల్లి సమీపంలోని సర్వీస్ రోడ్డుకు వెళ్లారు. కొంతసేపు వాకింగ్ చేసిన అనంతరం రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చొని సేదతీరుతున్నారు. అదే సమయంలో నాయుడుపేట వైపు నుంచి వేగంగా వచ్చిన దోస్త్ సరుకుల వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి విద్యార్థులు కూర్చున్న డివైడర్ వైపు దూసుకొచ్చింది. ఊహించని వేగంతో వాహనం ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు.

**ఒక్కరిని కబళించిన మృత్యువు**

ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బీహార్ రాష్ట్రానికి చెందిన ఆదిత్య బాంబయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న నాయుడుపేటకు చెందిన బ్రహ్మయ్య, మన్విష్‌లకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షణాల్లో జరిగిన ఈ ఘటనతో అక్కడ భీతావహ వాతావరణం నెలకొంది.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పెళ్లకూరు సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ ఆదిలక్ష్మి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థులను వెంటనే నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.మృతి చెందిన ఆదిత్య బాంబయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రపరిచారు. ప్రమాదానికి కారణమైన దోస్త్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహనం అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందా? డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడానికి గల కారణాలేమిటి? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. వాకింగ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో నాయుడుపేటలోని తోటి విద్యార్థులు, కళాశాల వర్గాల్లో విషాదం నెలకొంది.

# తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రాఖీలు కట్టిన రాప్తాడు చెల్లెమ్మలు

**- ఆత్మీయంగా రాఖీలు కట్టి స్వీట్లు తినిపించిన మహిళా కార్యకర్తలు**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** రాఖీ పౌర్ణమి సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాఖీ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. మతాలకతీతంగా మహిళా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు ప్రకాష్‌రెడ్డికి రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం ఒకరికొకరు రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అనంతరం ప్రకాష్ రెడ్డితో ఒక్కొక్కరు ఫొటోస్ దిగారు రాఖీ పౌర్ణమి సోదర--సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, మతాలకు అతీతంగా సోదరభావం, ఆత్మీ యతను చాటే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

**- ఎస్ఐ అమీర్ ఖాన్**



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో వాహనదారు లం దరూ తప్పనిసరిగా రోడ్డు నిబంధ నలు పాటించాలి,తప్పితే కఠిన చ ర్యలు తీసుకుంటామని గుత్తి ఎస్సై అమీర్ ఖాన్ హెచ్చరించారు.గుత్తి లోని పలు ప్రాంతాల్లో పోలీసు సి బ్బందితో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు.హెల్మెట్,ఆర్సీ,లైసె న్స్,రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై జరిమానా విధిం చారు.మొదటిసారి జరిమానాలతో సరిపెడతామని రెండోసారి పట్టుబడి తే కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు.

# పెళ్లైన రెండు నెలలకే భర్తతో గొడవ...!

**- బాంబే నుంచి రైల్లో వెళ్లిపోతున్న నవ వధువు..**
**- అనంతపురం ఆర్‌పీఎఫ్ పోలీసుల చొరవతో కుటుంబ సభ్యులకు అప్పగింత**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఎన్నో ఆశలతో అత్తారింట అడుగుపెట్టిన ఓ నవ వధువు.. పెళ్లైన రెండు నెలలకే భర్తతో గొడవపడింది. కాపురం చేయడం ఇష్టం లేక ఇంటి నుంచి వెళ్లిపోయి ముంబై నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న రైలు ఎక్కింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు.. అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఆమెను గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ సీఐ సుధాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబైలోని ఓ ప్రభుత్వ శాఖలో ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న కైలాష్ చంద్రకాంత్ భల్సింగ్‌కు రెండు నెలల క్రితం శీతల్ బాలసాహెబ్ ఉగలే (22)తో వివాహమైంది. అయితే పెళ్లి అనంతరం దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగు తున్నట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శీతల్ ఇంటి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది.ఈ క్రమంలో ముంబై నుంచి బెంగళూరు వైపు బయలుదేరిన రైలు ఎక్కింది. శీతల్ కనిపించక పోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ముంబై పోలీసులను ఆశ్రయించి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ముంబై పోలీసులు రైల్వే శాఖకు సమాచారం అందించి అన్ని స్టేషన్లను అప్రమత్తం చేశారు.ఈ సమాచారం గుంతకల్లు సెక్యూరిటీ కంట్రోల్‌కు చేరడంతో.. వారి ఆదేశాల మేరకు అనంతపురం ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి ముంబై నుంచి వచ్చిన రైలు అనంతపురం చేరుకోగానే తనిఖీలు చేపట్టి శీతల్‌ను గుర్తించారు.అనంతరం మహిళా హెడ్ కానిస్టేబుల్ ఉషారాణి, కానిస్టేబుల్ ఆశా పవర్ సంరక్షణలో ఆమెను ఉంచారు. సీఐ సుధాకర్‌రావు శీతల్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి, ముంబైలోని ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.శనివారం అనంతపురానికి చేరుకున్న కుటుంబ సభ్యుల వివరాలు, ఆధారాలను పరిశీలించిన అనంతరం శీతల్‌ను వారి సంరక్షణకు సురక్షితంగా అప్పగించారు. కుటుంబ సభ్యులు ఆమెను తిరిగి ముంబైకి తీసుకెళ్లారు. సమయస్ఫూర్తితో స్పందించి నవ వధువును సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతపురం ఆర్‌పీఎఫ్ పోలీసులకు శీతల్‌తో పాటు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.